# ఆగస్టు ఆరు నుంచి సిపిఐ పాదయాత్రలు




-పోస్టర్ ఆవిష్కరణ

2లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 26 | జూలై | 2026
పేజీలు : 8

## కమ్ముకొస్తున్న కరువు ఛాయలు..!



-మబ్బులే తప్ప రాలని చినుకులు
-వాడుతున్న మొక్కలు..
బీళ్లుగా మాగాణి భూములు

**ప్రజాపక్షం/ఖమ్మం :** కరువు ఛాయలు కమ్ముకొస్తున్నాయి. 99 శాతం వర్షపాతం లోటుతో ఖరీఫ్ కుదేలైంది. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షాలు లేకపోవడంతో జల వనరులు వట్టిపోతున్నాయి. జులై మొదటి వారంలో అడపా దడపా కురిసిన చినుకులకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. అవి మొలకెత్తి మూరాకు తొడిగాయి. ఇప్పుడు భూమిలో పదును లేక వాడిపోతున్నాయి. మాగాణి భూములు బీళ్లుగానే ఉన్నాయి. మోటార్ల క్రింద సమృద్ధిగా నీరు ఉన్న చోట మాత్రమే వరి నారు పోసి నాట్లకు సిద్ధమవుతుండగా మరికొందరు వరి విత్తనాలు చల్లేందుకు పొలం సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 5.20 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా అందులో సుమారు 2.30 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువ ద్వారా 16 మండలాల్లోని సుమారు 2.5 లక్షల ఎకరాల్లో సాగునీరు అందుతుంది. ఈ ఏడాది కృష్ణానది

మిగతా 2లో..

### అధికారులు సమన్వయంతో
## పనిచేస్తేనే పనులు వేగవంతం



- విద్యావైద్యం పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- ప్రతీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేద్దాం
- సమీక్షా సమావేశంలో ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి పనుల్లో వేగం సాధ్యమవుతుందని ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సూచించారు. శనివారం ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ నీటి పారుదల విద్యవైద్య వ్యవసాయ రెవెన్యూ రోడ్లు భవనాలు పంచాయితీరాజ్ తదితర శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని విద్యవైద్యం పారిశుధ్యం తదితరప్రజా సమస్యలను అధికారులతో ఆయన క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రభుత్వం శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోతే పనుల్లో జాప్యం జరిగి సాధారణ ప్రజలకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ప్రధానంగా

మిగతా 2లో..

## సిపిఐ సర్పంచ్ వెంకట రమణ మృతి

-కూనంనేని, సాబీర్ పాషా సంతాపం
- సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని దంతెలబోర ఎస్సీ కాలనీ సిపిఐ పక్ష సర్పంచ్ వెంకట రమణ (34) శుక్రవారం రాత్రి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల కాలు గాయంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఆమెను కుటుంబ సభులు మొదట భద్రాచలంలోని మిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. ఖమ్మ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ తుది శ్వాస విడిచారు. వెంటర రమణకు భర్త, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. మొదట భద్రాచలంలో అందించిన వైద్యం వికటించడం వల్లే ఆమె మృతి చెందిందని భావించిన కుటుంబ సభ్యులు భద్రాచలంలో ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. అయితే చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను వైద్యబృందం వారికి వివరించడంతో సంతృప్తి చెందిన కుటుంబ సభ్యులు నిరసనను విరమించుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ఆమె స్వగ్రామమైన దంతెలబోరకు తరలించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించిన వెంకట రమణ మృతిపట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అలాగే పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరి వెంకటేశ్వర రావు కార్యవర్గ సభ్యులు వి పూర్ణ చందరరావు అడుసుమిల్లి సాయిబాబా ఉప్పుశెట్టి రాహూల్ తదితరులు సంతాపాన్ని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రజా సేవలో ముందంజలో ఉన్న యున నాయకురాలిని కోల్పోవడం తీరని లోటని వెంకటరమణ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.

## నిరంకుశ ప్రభుత్వంపై యువత సాధించిన విజయం

-ఢిల్లీ హింసపై విచారణ జరిపించాలి : సిపిఐ నేత బాగం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** నిరంకుశ ప్రభుత్వంపై యువత, విద్యార్థులు పోరాడి విజయం సాధించారని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా బిజెపి ప్రభుత్వానికి ఒక గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో శనివారం హేమంతరావు ఒక ప్రకటన విడుదల చేశారు. లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడటమే కాకుండా 21 మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన నీట్ పేపర్ లీకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు బిజెపి అనుబంధ సంస్థలు

మిగతా 2లో..

## విద్యార్థుల ఐక్యపోరాట ఫలితమే ధర్మేద్ర ప్రధాన్ రాజీనామా



- విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులును ఎత్తివేయాలి: సిపిఐ నేత సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నీట్ సిబిఎస్ఇ పరీక్షా పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐఖ్యపోరాట విజయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. శనివారం ఆయన ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశరాజధాని ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద 49 రోజులుగా విద్యార్థులు నిర్వహించిన మిలిటెంట్ పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పేపర్ లీకేజీ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, రాజీనామా చేసిన ధర్మేంధర్ ప్రధాన్‌కు మరోశాఖ కేటాయించవద్దని డిమాండ్ చేశారు. అలాగే విద్యావ్యవస్థ రక్షణ కోసం తమ హక్కుల కోసం ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై పోలీసులు బనాయించిన అక్రమ కేసులన్నంటినీ కేంద్రప్రభుత్వం భేషరతుగా ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కమ్ముకొస్తున్న కరువు ఛాయలు..!

(మొదటిపేజీ తరువాయి) పరివాహక ప్రాంతంలో వర్షాలు లేకపోవడంతో కృష్ణానదిలోకి కొత్త నీరు రాకపోవడంతో నది పరివాహక ప్రాజెక్టులు అడుగంటాయి. ఈ నేపథ్యంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్‌కు నీరు విడుద లయ్యే అవకాశం లేదు. ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇటీవల స్పష్టం చేశారు. దీనితో నాగార్జున సాగర్ ఎడమ ఆయకట్టు పరిధిలోని 2.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవ కాశం లేదు. మధ్యతరహా ప్రాజెక్టులైన పాలేరు, వైరాలో కొంత మేర నీరు ఉన్న భవిష్యత్తు అవసరాల దృష్ట్యా నీటిని విడుదల చేయడం లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఇక చిన్న చెరువులు, కుంటలు వెయ్యి వరకు ఉండగా దేనిలోనూ సాగునీటిని అందించేందుకు నీళ్లు లేవు. ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల హెక్టార్లలో పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 1.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. పత్తి మొక్కలు తేమ లేక వాడిపోతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.64 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇక్కడ కూడా ప్రధాన ప్రాజెక్టు లైన కిన్నెరసాని, మూకమామిడి తదితర మధ్యతరహా ప్రాజెక్టులు నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. అశ్వారావుపేట మండలంలోని పెద్ద వాగు ప్రాజెక్టు తెగిన తర్వాత ఇంత వరకు మరమ్మతులు జరగకపోవ డంతో పంటలు సాగయ్యే అవకాశం లేదు. కానీ ఛత్తీస్‌గఢ్‌లో వర్షాలు పడుతుండడంతో తాలిపేరుకు మాత్రం కొత్త నీరు రావడంతో తాలిపేరు ప్రాజెక్టు క్రింద సాగునీరు అందించే అవకాశం ఉంది. మొత్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి పరిస్థితి అత్యంత నిరాశజనకంగా, ఇబ్బం దికరంగా ఉంది. జీవనదుల్లాంటి అనేక ఏర్లు, వాగులు నీటి చెమ్మ కూడా లేని పరిస్థితి. భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి కూడా తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కరువును అధి గమించేందుకు అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది. ముఖ్యంగా రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# బోనకల్‌కు సోలార్ వెలుగు..!



**-ఆగస్టు 15 నాటికి మోడల్ మండలంగా తీర్చిదిద్దుతాం**
**-రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖీ**

ప్రజాపక్షం/బోనకల్‌: బోనకల్ మండలాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే మోడల్ సోలార్ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 81 మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో భాగంగా బోనకల్, రావినూతల, గార్లపాడు గ్రామాల్లో జరుగు తున్న సోలార్ పనులను శనివారం రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖీ, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ, ఐఏఎస్ కర్నాటి వరుణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. అనంతరం రైతువేదిక సోలార్ రూఫ్‌టాఫ్, సోలార్ పంప్‌సెట్ వినియోగదారులతో ముఖాముఖి సమా వేశం నిర్వహించి అవగాహన కల్పించారు. రెడ్కో వైస్ చైర్మన్ ముషారఫ్ ఫరూఖీ మాట్లాడుతూ సౌర వనరులు అపరిమితం, వాటిని సద్విని యోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అని అన్నారు. బొగ్గు వంటి సంప్రదాయ ఇంధన వనరులు పరిమితమైన నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంపాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్య మంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టీ విక్రమార్క దిశాని ర్దేశంతో తెలంగాణను సోలార్ తెలంగాణ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1000 కోట్లు వ్యయంతో 81 మోడల్ సోలార్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయి సోలార్ గ్రామంగా తీర్చి దిద్దినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాఫ్ ఏర్పాటు చేసు కోవడం ద్వారా విద్యుత్ అవసరాలు తీర్చుకోవడంతో పాటు అదనపు విద్యుత్ గ్రిడ్‌ను విక్రయించి ఆదాయం పొందవచ్చని ఆయన వివరిం చారు. ఆగష్టు 15 నాటికి బోనకల్ మండలంలో అన్ని సోలార్ పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని అధికారులను ఆదేశించారు.



టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి రూ.60 కోట్లు వెచ్చిస్తున్నామని తెలి పారు. మూడు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని రావినూతలలో 132 కేవీ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సోలార్ పంప్‌సెట్ల వినియోగం రైతులకు దీర్ఘకా లికంగా విద్యుత్ ఖర్చులు తగ్గించి అదనపు ఆదాయాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రతి ఇంటిని సోలరైజ్ చేయడమే లక్ష్యం అన్నారు. స్థానికంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవ చ్చని, సంప్రదాయ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని చెప్పారు. మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్కో, టీజీఎన్‌పీడీసీఎల్ ఉన్నతాధికా రులు,జిల్లా అధికారులు, సూపరిటెండింగ్ ఇంజనీర్లు, ప్రాజెక్టు అధికా రులు, అమలు సంస్థల ప్రతినిధులు, సర్పంచులు, రైతులు, ఆయా రాజ కీయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు కోసమే అధికార పార్టీలోకి..

**- కాల్వను మింగి డీటీసీపీ వెంచర్‌లో కలిపేసుకున్నాడు**
**-పంచాయతీలో లేఅవుట్ చేసిన మూడు ప్లాట్లు సైతం అందులోనే..**
**-విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్**
**- మున్సిపల్ కమీషనర్‌కు సీపీఐ ఫిర్యాదు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : వెంపటి రామకోటయ్య పేరుతో వేసిన వెంచర్‌కు అక్రమ పద్ధతులలో అనుమతులు పొందినందుకే వెంపటి సురేష్ అధికార పార్టీలో చేరారని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకు పల్లి భాస్కర్ ఆరోపించారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీ 29వ వార్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు...ఏదులాపురం రెవెన్యూలో వేసిన వెంచర్‌లో కాల్వలను ఆక్ర మించి వాటిని డీటీసీపీ వెంచర్‌లో కలిపేశారని, అంతేకాకుండా గ్రామ పంచాయతీ లేఅవుట్‌లో 1,2,3 నెంబర్లుగా ఉన్న ప్లాట్లను కూడా అదే వెంచర్‌లో చేర్చారని భాస్కర్ ఆరోపించారు. వెంచర్‌కు అవసరమైన 60 అడుగుల రహదారి లేకపోయినా ఉన్నట్లు చూపించి అనుమతులు పొందేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఇప్పుడు అనుమతి పొందిన వెంచర్‌కు నాలుగు సంవత్సరాల నుంచి అధికారులు ఎటువంటి పర్మి షన్లు ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పుడు అధికారులను తప్పుదోవ పట్టించి పొందిన టీఎల్పీని తక్షణమే రద్దు చేసి పంట కాలువను పునరుద్ధరించా లని కోరారు. ఏర్పాటు చేసిన వెంచర్ కింద భాగంలో కాల్వలు అలానే ఉన్నాయని, ఆ వెంచర్‌లోకి వచ్చేసరికి మాత్రం మాయం అయ్యాయ న్నారు. వెంచర్‌కు రేరా ఆమోదం పొందినట్లు ప్రచారం చేస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఎక్కడా ప్రదర్శించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రజలు భవిష్యత్తులో నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై హైదరాబాద్‌లోని డీటీసీపీ, రేరా కార్యాలయాలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం సీపీఐ నాయకులు మున్సిపల్ కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, కాల్వల ఆక్రమ ణలు, వెంచర్ అనుమతుల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, 28,32వ వార్డుల సిపిఐ కౌన్సిలర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ నాయకులు వెన్నం భాస్కర్, వెంపటి రాము, మిరియాల నరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు ఆరు నుంచి సిపిఐ పాదయాత్రలు

ప్రజాపక్షం/ఖమ్మం :ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, పంటలకు గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఆగస్టు ఆరు నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం పాదయాత్రల పోస్టర్లను సిపిఐ నాయకులతో కలిసి స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ధరల పెరుగుదలతో సామాన్యులు బత కలేని పరిస్థితి ఏర్పడిందని ధరల పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. దేశంలో మునుపెన్నడులేని రీతిలో నిరుద్యోగం పెరిగిపోయిం దని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు వట్టిపోతున్నాయని వాటిని పునరుద్ధరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి దొరికేవిధంగా చర్యలు చేపట్టాలని విద్య, వైద్యం వ్యాపారంగా మారిన తరు ణంలో ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరు తుందని సురేష్ తెలిపారు. డిలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించా లని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుంద న్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించాలని ఈ పాదయాత్ర నిర్వహిస్తు న్నట్లు సురేష్ తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతా దేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో
# పనిచేస్తేనే పనులు వేగవంతం

(మొదటిపేజీ తరువాయి) పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని తాగునీరు విద్యుత్ సరఫ రాలో అంతరాయం తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అత్యంత కీలకమైన విద్యావైద్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వ బడులు ఆస్పత్రుల్లో సౌక ర్యాలను మెరుగు పరవాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి శాశ్వత పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కమీషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు జి రంగ స్వామి నందయ్య మధుకర్ శ్రీకాంత్ రాజశేఖర్ నాగేంద్ర శివలాల్ శ్రీనివాస్ విద్యానగర్ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ తదితరులు పాల్గొన్నారు.

# నిరంకుశ ప్రభుత్వంపై యువత సాధించిన విజయం

(మొదటిపేజీ తరువాయి) అనేక ప్రయత్నాలు చేశాయని మత భావాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నం చేశారని హింస ద్వారా విద్యార్థి యువజన ఉద్యమాన్ని అణిచివేయడానికి ప్రయత్నిం చారని ఆయన ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో గుండె నిబ్బరంతో శాంతియుతంగా యువజన విద్యార్థులు ఢిల్లీలో ప్రదర్శన నిర్వహించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచారని హేమంతరావు తెలిపారు. ఇది యువత, విద్యార్థులు సాగించిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇప్పటికైనా మోడీ, అమిత్‌షా ప్రజలు ఇచ్చిన అధి కారాన్ని ప్రజల కోసమే ఉపయోగించాలని ఆయన సూచించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ ఆందోళన వద్ద పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారని ఇందులో ఆర్‌ఎస్‌ఎస్ దాని అనుబంధ సంస్థలు కూడా పాల్గొన్నాయన్న దానిపై పూర్తి విచారణ జరిపించాలని హేమంత రావు డిమాండ్ చేశారు. న్యాయ విచారణ జరగాలని అందు కొరకు సిపిఐ డిమాండ్ చేస్తుందని ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు.

# ఆరు తడి పంటలు మాత్రమే సాగు చేయాలి



ప్రజాపక్షం/కల్లూరు: పంటలు సాగు చేసే విధంగా రైతులు సాగు చేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. కల్లూరు మండల పరి ధిలోని రఘునాధ గూడెం, చంద్రుపట్ల గ్రామా లలో వెల్లిన ఎల్ నీ నో పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలని గ్రామ గ్రామాన అవగాహన సదస్సులో పలు శాఖల ఆధ్వర్యంలో ఆగస్టు ఎనిమిదో తేదీ వరకు గ్రామ సభలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నీటిని పొదుపుగా వాడుకోవాలని రైతులను కోరుతున్నారు. గ్రామాలలో ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని వాటికి ప్రోత్సాహంకరంగా 6500 ప్రభుత్వం అందిస్తుందని పంట గుంటలు ఏర్పాటు చేసుకోవాలని 5 ఎకరాల లోపు ఉన్నవారికి ప్రభుత్వం తరఫున 2.50 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో రఘునాథ బంజర సర్పంచ్ కుక్క సుధారాణి, ఉప సర్పంచ్ కర్నాటి కోటేశ్వరి ,చంద్రు పట్ల సర్పంచ్ కాటం నేని విజయలక్ష్మి , ఉపసర్పంచ్ పైళ్ల రాధాకృష్ణ తోపాటు ఎంపీవో సురేష్ బాబు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, నీటిపారుదల శాఖ అధికారిని తేజస్విని మిషన్, భగీరథ జే ఈ శివాని, పలు శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు, లక్ష్మ ణరావు శ్రీనివాసరావు లతోపాటు ఆశ, అంగన్వాడి గ్రామస్తులు పాల్గొన్నారు.

# లారీ టిప్పర్ డ్రైవర్ మృతి

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండలం పెద్ద కొండి గ్రామానికి చెందిన మేకల కిరణ్ (36) వెన్నవల్లి గుట్ట నుంచి లారీ టిప్పర్ తో మట్టి తోలు తుండగా ఆంధ్రప్రదేశ్ తిరువూరు మండలం మునుకుళ్ళ గ్రామంలో మట్టిలోడును దింపే సమయంలో టిప్పర్ హైడ్రాలిక్ 11 కెవి విద్యుత్ వైర్లకు తగలడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మేకల కిరణ్ డ్రైవర్ అక్కడిక క్కడే మృతి చెందాడు. అతనికి భార్య, కూతురు ఉన్నారు. అతని మృతితో కుటుంబం అనాధగా మారింది. దీంతో పెద్ద కోరు కొండిలోని ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. పేద కుటుంబం అన్యోన్యంగా జీవించే ఈ కుటుంబం ఒకేసారి భర్త మరణించడంతో భార్య రోద నలు మిన్నంటాయి. దీనిపలన ఆమెను ఆ ఏదుపులను ఆపడం ఎవరి తరం కావడం లేదు. భౌతిక దేహమును కుటుంబాన్ని సర్పంచులు పలువురు ప్రజాప్రతినిధులు, సందర్శించి నివాళు లర్పించారు. భౌతిక దేహమును తిరువూరులోని ప్రాంతీయ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# సత్వర వైద్య సేవలు అందించాలి



**-మందుల నిల్వలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి**
**-మంచుకొండ పిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన సత్వర వైద్య సేవలు అందించేందుకు అధికారులు, వైద్యులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సేవల నాణ్యతను మెరుగుపర్చాలని కలెక్టర్ సూచించారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ల్యాబ్ సేవలు, మెడికల్ వార్డులు, రోగుల నమోదుతో పాటు ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. క్యాజువాలిటీలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. రోగులకు మందులు, పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందుతున్నాయా అనేది ఆరా తీశారు. అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల మందులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా పటిష్ట నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ పరీక్షలు, డయాగ్నస్టిక్ హబ్ సేవలను సమర్థవంతంగా వినియోగించి రోగులకు అవసరమైన పరీక్షా ఫలితాలను వీలైనంత త్వరగా అందించాలన్నారు. పరీక్షల నివేదికలు ఆలస్యమైతే చికిత్స కూడా ఆలస్యమవుతుందని అందువల్ల సమయపాలనకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం, తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు, రోగులు కూర్చునే ఏర్పాటు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. వైద్యులు అందుబాటులో, పరీక్షల వివరాలు, చికిత్సా విధానాలు, మందుల నిల్వల సమాచారం ఆసుపత్రి ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, సర్పంచ్ తేజావత్ శంకర్, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ దోమ ఆనంద్ బాబు సూచించారు. శనివారం మార్కెట్ కమిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తగినంత వర్షపాతం లేకపోవడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో అధిక నీటి అవసరమున్న పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం రైతులకు ప్రయోజనకరమని అన్నారు. వర్షాధార పంటలపై పూర్తిగా ఆధారపడకుండా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు త్వరగా చేతికి రావడంతో పాటు రైతులకు ఆర్థికంగా కూడా మేలు చేస్తాయని ఆయన వివరించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చారు.వ్యవసాయ శాఖ అధికారులు ఎల్లప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని, వారి సలహాలు, సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించి అభివృద్ధి చెందవచ్చని దోమ ఆనంద్ బాబు తెలిపారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# వరి వద్దు..ఇతర పంటలు సాగు చేయండి

**ఏడిఏ శ్రీనివాసరెడ్డి**




**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల వైవిధ్యీకరణ, వ్యవసాయ కుంటల ప్రాముఖ్యతపై సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) శ్రీనివాసరెడ్డి శనివారం రామచంద్రరావు బంజర గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ఎల్‌నినో అంటే ఏమిటి, ఎల్‌నినో రావడానికి గల కారణాలు దీని ప్రభావం వల్ల పంటలకు కలిగే నష్టాలు తెలియజేశారు. ఎల్‌నినో కారణంగా వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవిఎస్ ప్రసాద రాజు, ఉద్యానవన శాఖ అధికారి నగేష్, నీటి పారుదల శాఖ ఏఈఈ నరేష్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ, విద్యుత్ శాఖ ఎల్‌ఐ, పెనుబల్లి క్లస్టర్ ఏఈఓ నరేష్, పంచాయతీ కార్యదర్శి వి. నరేంద్ర రెడ్డి, గ్రామ సర్పంచ్ గూగులోత్ హైమవతి, గ్రామ పెద్దలు యలమర్తి శ్రీనివాసరావు, ఆలుగోజు రామ నరసింహారావు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, చిన్నం మల్లయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బొగ్గు రవాణా విస్తరణ అవకాశాలపై అధికారులతో సమీక్ష

**జేవీఆర్ సీహెచ్‌పీని సందర్శించిన రైల్వే బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ (రైల్వే బోర్డు) ట్రాఫిక్ ట్రాన్స్‌పోర్టేషన్ (కోల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సయ్యద్ అబ్దుల్ రహమాన్ శనివారం సత్తుపల్లి ఏరియాలోని జేవీఆర్ సీహెచ్‌పీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న (ఐఆర్‌టీఎస్), సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యటనలో భాగంగా అధికారులు జేవీఆర్ సీహెచ్‌పీలోని సైలో బంకర్, రైల్వే లోడింగ్ పాయింట్లు, సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించారు. అలాగే సత్తుపల్లి ఏరియా నుంచి రైల్వే మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా, డిస్పాచ్ విధానంపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న (ఐఆర్‌టీఎస్), సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివోఎం డి. నరేంద్ర వర్మ, ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ సత్తుపల్లి ఏరియాలోని రైల్వే మార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణా, డిస్పాచ్ వివరాలను వివరించారు. రాబోయే రోజుల్లో రైల్వే ద్వారా బొగ్గు రవాణాను మరింత పెంచేందుకు ఉన్న అవకాశాలు, అవసరమైన చర్యలుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖర రావు, ఎస్ఓటు జీఎం బొల్లం శ్రీనివాస్, జేవీఆర్ సీహెచ్‌పీ ఎస్‌సీ (ఈ అండ్ ఎం) సాయినాథ్, ఎస్‌సీ (సివిల్) ఎ. రవికుమార్ తో పాటు సింగరేణి, రైల్వే శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలతో నష్టాల నివారణ




**ప్రజాపక్షం/చింతకాని :** ఎల్‌నినో ప్రభావంతో రైతులు తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మధిర డివిజన్ ఉద్యానవన అధికారి ఎ విష్ణు రైతులకు సూచించారు. చింతకాని మండలం జగన్నాధపురం, మత్కేపల్లి గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావం పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగన్నాధపురం, మత్కేపల్లి సర్పంచ్‌లు తాళ్ళూరి స్వప్న, కంచం ద్రౌపది మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.ఉద్యానవన అధికారి విష్ణు మాట్లాడుతూ రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు బదులుగా నీటి పొదుపు సాంకేతికలను అనుసరిస్తూ ప్రత్యామ్నాయ ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు.కూరగాయలు పండ్ల తోటలను సాగుచేయాలని వీటితో నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ఉద్యానవన పంటలపై ఉన్న సబ్సిడీ వివరాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేజీబీవీ ఉద్యోగుల పోస్ట్ కార్డ్ ఉద్యమం



**ప్రజాపక్షం/చింతకాని:** టీఎస్‌యూటీఎఫ్ చింతకాని మండల శాఖ ఆధ్వర్యంలో లచ్చగూడెం కేజీబీవి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. రాస్రట కమిటీ పిలుపు మేరకు శనివారం కేజీబీవి ఉద్యోగులు ముఖ్యమంత్రి పోస్ట్ కార్డుల ద్వారా తమ సమస్యలు పంపించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టీఎస్‌యూటీఎఫ్ చింతకాని మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగుల సమస్యలు పట్ల గతంలో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి వాటిని పరిష్కరించాలన్నారు. కేజీబీవి ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, వార్షిక ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, సమ్మెకాలపు జీతాలు ఇప్పించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమాన అవకాశాలు ఇవ్వాలని, కేర్ నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు ఎస్ అనిల్‌కుమార్, శంకర్ రెడ్డి, యూ నాగేశ్వరరావు, రమణ, కేజీబీవి ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్పాహారం ప్రారంభం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పాహార కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తుళ్లూరి నిర్మలాకుమారి, హెచ్‌ఎం జ్యోతిశ్రీతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలాకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమం నిర్వహించడం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల హాజరుశాతం పెరగటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను ఉపాధ్యాయులు సిబ్బంది ప్రతిఒక్క విద్యార్థికి అందించే విధంగా కార్యాచరణ చేయాలన్నారు. ఈ పథకం ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చుట్టు పార్వతీ, వార్డు మెంబర్లు భూక్య బాలాజీ, కాంగ్రెస్ నాయకులు తల్లపురెడ్డి వెంకట్రామిరెడ్డి, నన్నపనేని రామారావు, బాణావత్ శ్రీను, చొప్పవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మండల పరిధిలోని రేమిడిచర్ల గ్రామంలో శనివారం రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఎంపి నిధులతో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు సామినేని చెన్నకేశవరావు, గ్రామ సర్పంచ్ కాపు వరప్రసాదరావు అధ్యక్షతన రూ.5లక్షల నిధులతో మంజూరైన సిసి రోడ్డుకు రేణుక చౌదరి పిఎ పుల్లయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు దివ్వెల కృష్ణయ్య, బుగ్గవరపు వెంకటేశ్వరరావు, కర్లపూడి అప్పారావు, ఆలస్యం నర్సయ్య,మండల నాయకులు జల్లేపల్లి ప్రసాద్, గంగినేని శ్యాంప్రసాద్, బాదా సత్యనారాయణరెడ్డి, నాగిరెడ్డి సాంబశివరావు, చింతనిప్పుల శ్రీనివాసరావు, కొండపాటి భుజంగరావు, సామినేని మురళీ, నాగేశ్వరరావు, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అల్పాహారం ప్రారంభం



**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని సర్పంచి కట్టకూరు ఉపేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపూడి బుచ్చిరామయ్య శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం, పాలు, రాగిజావా వంటి పౌష్టికాహారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఆరోగ్యవంతమైన ఆహారంతోపాటు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఉచిత అల్పాహార పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు హాజరుశాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండ లం మద్దుకూరు శివారు మంగళ బోడు వలస ఆదివాసీ గ్రామంలో ఎర్ర గుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వాణి నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందు లు, వ్యాధి నిరోధక టీకాలు అందించారు. అలాగే కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేసి, డెంగ్యూ, మలేరియా నివా రణకు వాటిని తప్పని సరిగా వినియోగించాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రకాశరావు, ఏఎన్ఎంలు, శాంతమ్మ, భవాని, ఆశాకార్యకర్తలువెంకట లక్ష్మీ ,విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** తొలి ఏకా దశి సందర్భంగా దుమ్ముగూడెం మండ లంలోని పర్ణశాల పుణ్యక్షేత్రం, నర్సా పురం శివాలయం, లక్ష్మీ నగరం ఆంజనే యస్వామి ఆలయం, దుమ్ముగూడెం ము త్యాలమ్మ, ఆత్మరామచంద్రస్వామి దేవాల యాల్లో శనివారం భక్తులు భారీగా తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

## ప్రజాస్వామ్యం గెలిచింది..

**ప్రజాపక్షం/కారేపల్లి:** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన నిరసనలు ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్ అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిపై యువత ఐక్యంగా పోరాడడంతో కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా వ్యవస్థలో పూర్తి పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజా స్వామ్యంలో యువత శక్తి ఎంత గొప్పదో ఈ ఉద్యమం మరోసారి నిరూపించిందని ఆయన పేర్కొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్ సూచించారు. శనివారం మండల పరిధిలోని జక్కేపల్లి గ్రామంలో నిర్వహించిన రైతుల అవ గాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 57శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. రైతులు పెసర, కంది, జొన్న, ఆముదం వంటి పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో జక్కేపల్లి సర్పంచ్ చంద్రారెడ్డి, సొసైటీ ఛైర్మన్ దార జయశ్రీ, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, ఇరిగేషన్ ఏఈ నవీన్, వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, పశువైద్య అధికారి, పంచా యితీ కార్యదర్శి, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఫణితి సైదులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదినాన్ని పుర స్కరించుకొని వైరా మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు ఆధ్వర్యంలో జస్విక నందన వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేస్తూ జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రజల ఆదరణతో ముందుకు సాగుతున్న నాయకుడని అన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి ఆయన ప్రత్యేక కృషి చేస్తూ పలు అభివృద్ధి పను లకు నిధులు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫణిది గిరి, పోటు మధు, పైడిపల్లి శ్రీను, చెరుకూరి శ్రీను, సరిపూడి కోటేశ్వరరావు, దారా వెంకన్న, ఫణితి నాగార్జున, అక్బర్ బీరెల్లి గురవయ్య, దారా సుధాకర్, షేక్ మీరా, బీబా, కాంద్ర శ్రీను, అల్లు బుజ్జి బాబు, అల్లు భూషణం, షేక్ లాలు, భాస్కర్, కాంద్ర రాము, అరవింద్, కదలి శ్రీను, వేముల రంగా, రాజేష్ ఆవుల, దారా అభిషేక్, గుజ్జర్ల పవన్, ఉప్పు రామకృష్ణ, గంధంనేని రామారావు, ఆకుల దుర్గ, తాళ్లూరి మురళి, విజయ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆర్థికసాయంతో సొంతింటి కల సాకారం

**-ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి**
**-ఈర్లపుడిలో ఇండ్ల పురోగతిని పరిశీలించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు సం బంధించి లబ్దిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి సొంతింటి కల సాకారం చేస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని తెలిపారు. శనివారం రఘునాథ పాలెం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈర్లపుడి గ్రా మంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లను సందర్శించారు. లబ్దిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పలు సూ చనలు చేశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో మొ దటి విడతలో 160 ఇండ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే 98 ఇండ్లు పూర్తయ్యాయని 62 ఇండ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నా యన్నారు. లబ్దిదారులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్త యిన దశల ప్రకారం ప్రతి సోమవారం బిల్లులను బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నామన్నారు.ఇండ్ల నిర్మాణంలో ఎటువంటి జాప్యం లేకుం డా రెవెన్యూ, గ్రామ పంచాయతీ, హౌజింగ్ తదితర శాఖల సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్ కుమార్, సర్పంచ్ గీత దేవ్‌సింగ్, హౌజింగ్ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని రోజును పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకట్ రెడ్డి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలోని పేదల సంక్షేమం, అభివృద్ధికి రాందాస్ నాయక్ కృషి చేస్తున్నారన్నారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రజా జీవితంలో కొనసాగాలని నేతలు ఆకాంక్షించారు. ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా చంద్రుగొండ, పాపకొల్లు క్రాస్ రోడ్డు ఆటో స్టాండ్ల వద్ద ఆటో డ్రైవర్లకు,గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మధుసూదన్ రావు, చౌడం నరసింహారావు, సర్పంచులు బానోత్ సుమలత, భూక్య చంద్రబాబు, బోడ భీమారావు, మహిళ అధ్యక్షురాలు గుగులోత్ సునీత, రామిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

# పేరుకే చెరువులు, కుంటల తవ్వకాలు..!



**ప్రజాపక్షం/మణుగూరుః** అభివృద్ధి మాటున అక్రమ సంపాదనకు మణుగూరు కేంద్ర బిందువుగా మారింది. మేము ఏమైనా చేస్తాం.. మాకు అడ్డు చెప్పే వారే లేరు అంటూ దూసుకు పోతున్న మట్టి తోల కాల ముఠా నాయకులు. మణుగూరులో అక్రమ మట్టి తోలకాల రోజు రోజుకు పెరిగిపోతుంది. చెరువులు, కుంటల అభివృద్ధి పేరుతో మట్టి తోలకాల దందా మూడు జేసీబీ లు ఆరు ట్రక్కులుగా కొనసాగుతోంది. చెరువులు, కుంటల అభివృద్ధి పేరు చెప్పి తమ ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారు. మణుగూరులో కొందరూ ఒక ముఠాగా ఏర్పడి మట్టి దందాను కొనసాగిస్తున్నారు. ఎక్కడ మట్టి తవ్వకాలు జరిగినా వీరి పేరే వినిపిస్తుంది. అసలు చెరువులు, కుంటల్లో తవ్విన మట్టి ఎటు పోతుందో అర్థం కాని పరిస్థితి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా మట్టిని గల్లీల్లో నుండి తరలిస్తూ అమ్ముకుని సొమ్ము చేసుకుంటు న్నారు.ఎటువంటి లైసెన్స్ లేని మైనర్లతో..రాత్రిళ్ళు ట్రాక్టర్ల శబ్దాలతో ప్రజలు నిద్ర పట్టక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దందాకు అధి కార పార్టీ నాయకుల అండ దండలు పుష్కలంగా ఉన్నాయి. మట్టి తోలకం దారులను మట్టి ఎక్కడికి తోలుతున్నారని ప్రశ్నిస్తే మా ఇష్టం పూడికలు తీయవద్దా అంటూ సమాధానాలు చెబుతున్నారు. మేము పర్మిషన్లతోనే మట్టింతోలకాలు జరుపుతున్నాం అంటూ బహిరంగం గానే అంటున్నారు. ఎటువంటి లైసెన్స్ లేని మైనర్లతో ట్రాక్టర్లను నడిపి స్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ దందాను అడ్డుకునేందుకు అధికారులను సైతం జోక్యం చేసుకొనివ్వ కుండా కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు అడ్డుపడుతున్నట్లు సమాచారం. ఈ విధంగా అధికార పార్టీ నాయకుల హవా కొనసాగుతోంది. ఈ దందాకు చెక్ పెడతారో లేక దందాను మరింతగా పెంచి జేబులు నింపుకుంటారో చూడాల్సిందే.

## హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ



**ప్రజాపక్షం/మణుగూరుః** మణుగూరు మండలం, సమితి సింగారం అశోక్‌నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న పీఎంహెచ్ హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేం దుకు ప్రభుత్వం విద్యాసంస్థల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం హాస్టల్‌ను సంద ర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన మెనూ, తాగునీరు, పారిశుధ్యం, వసతి గదుల పరి స్థితి తదితర అంశాలపై హాస్టల్ సిబ్బంది, అధికారులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌక ర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు హాస్టల్ నిర్వహణను మరింత మెరుగుపర్చాలని సంబంధిత అధికారు లకు సూచించారు. అలాగే ప్రహరీ గోడ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదే శించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా సంస్థల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయ కులు, మైనారిటీ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, గుమస్తాల సంఘం నాయకులు, 14 టైర్, 12 టైర్ యూనియన్ నాయకులు, మహిళా నాయకులు, ప్రజాప్రతిని ధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హాస్టల్ సిబ్బంది పాల్గొ న్నారు.

# మూడేళ్లయినా పూర్తి కాని రేషన్ ఈ కెవైసి..!

**- లబ్ధిదారుల్లో నిర్లిప్తత**
**- భద్రాద్రి జిల్లాలో సుమారు 76 శాతమే పూర్తి**
**- ఈనెలాఖరు వరకే గడువు..లేదంటే రేషన్ బంద్**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిజమైన అర్హులకు రేషన్ బియ్యం అందేలా ప్రభుత్వం ఇ కేవైసి చేయా లని నిర్ణయించింది. ఇందు కోసం కార్డుల్లోఉన్న సభ్యులంతా రేషన్ షాపుకు వెళ్లి ఈ కేవేసి చేయించుకో వాలి. కానీ ఈ ప్రక్రియ ఇంత వరకు పూర్తి కాలేదు. జిల్లా వ్యాప్తంగా 76 శాతం మాత్రమే సుమారుగా పూర్తయిందని, ఇంకా 24 శాతం మంది ఇందుకు ముందుకు రాలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి మూడేళ్లవుతున్నప్పటికీ లబ్దిదారుల్లో నిర్లిప్తత నెలకొనడంతో ప్రభుత్వం ఓ అడుగు ముందుకేసి ఈనెలాఖరు నాటికి సమయాన్ని పొడిగించింది. అప్పటికి కూడా ఈ కేవేసి పూర్తి చేయని వారిని అనర్హు లుగా గుర్తించి వారి రేషన్ బంద్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది.

**బియ్యం సరఫరా ఇలా :** రేషన్ కార్డు లబ్దిదారులకు అన్నపూర్ణ కార్డు దారులకు ఒక్కొక్క యూనిట్ 10 కిలోలు, అంత్యోదయ కార్డు దారులు ఒక్కొక్క యూనిట్‌కు 35 కిలోలు, ఆహార భద్రతా కార్డు దారులు ఒక్కొక్క యూనిట్‌కు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. కాగా చినిపోయిన వారి పేర్లు కూడా కార్డుల్లో కొనసాగుతుండగా వారి పేరుమీద కూడా రేషన్ సుకుంటు న్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఈ కేవైసిని ప్రవేశపెట్టింది.

**ఈ కేవైసి :** రేషన్ కార్డులోని లబ్దిదారులు రేషన్ షాపుకు వెళ్లి ఈ పాస్ మిషన్‌లో వేలిముద్రను వేసి ఈ కేవైసి పూర్తి చేసుకోవాలి. కానీ ఇప్పటి వరకు కొందరు అందుకు ముందుకు రాలేదు. దీంతో ప్రభుత్వం పలు మార్లు గడువు పొడిగించినప్పటికీ ముందుకు రాకపోవడంతో ఈనెల 31 నాటికి ఈ కేవైసి పూర్తి చేయాలని, లేదంటే ఆగస్టు నెల నుండి రేషన్ ఇవ్వరని తేల్చారు. దీంతో రేషన్ షాపు ఓనర్లు ఈ కేవైసి చేయని వారి పేర్లను సేకరించి వారి ఫోన్ నెంబర్లను తీసుకుని వారికి నేరుగా ఫోన్ చేసి ఆ ప్రక్రియను పూర్తి చేసేందుకు హడావిడి చేస్తున్నారు.

# ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రస్తుత పరిస్థితులలో ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఆజయ్ తండా పంచాయతీ సర్పంచ్ తేజావత్ శివాజీ సూచించారు. మండలం లోని ఆజయతండా లో శనివారం రైతు లకు అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాతావరణం అనుకూలంగా ఉన్న పంటలనే సాగు చేసు కోవాలని అన్నారు. నీటి శాతం తక్కువగా ఉన్నందున్న రైతులు వరిక బదులు ప్రత్యామ్నయ పంటలను వేసుకోవాలన్నారు. ఆరుతడి పంట లైన పెసర, కంది, మినుము ఇతరత్రా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావం ప్రమాధకరంగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారని పేర్కొన్నారు. కుంటల వలన రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కావునా రైతులు ఈ అవ కాశం ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల ను సాగు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో చెరువు మాదరం పశువైద్య అధికారి డాక్టర్ సాహిత్య,వ్యవ సాయ విస్తీరణాధికారి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్ కుమార్, వార్డు సభ్యులు బాషా, సుశీల, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు వెంకటేశ్వర్లు, వీఓ అధ్యక్షురాలు సక్కుబాయి, గ్రామదీ పిక కవిత, ఆశా వర్కర్ విజయ తదితరులు. పాల్గొన్నారు.

## సమష్టి వ్యవసాయమే ఎఫ్‌పీవో లక్ష్యం

**-నేరుగా వరి విత్తనంతో అధిక దిగుబడి**




**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతుల్లో సమిష్టి తత్వాన్ని పెంపొందించి, ఆధు నిక వ్యవసాయ సాంకేతికతను అందించడమే రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీవో)లక్ష్యమని కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ వైస్ ప్రిన్సి పాల్ రాజయ్య అన్నారు. శనివారం కారేపల్లిలో ఎఫ్‌పీవో, కారేపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాస రావు అధ్యక్షతన రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసంద ర్భంగా రాజయ్య మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న రైతులకు ప్రభుత్వ వాటాతో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కవిరాజ్ మాట్లాడుతూ నేరుగా వరి విత్తే ఖర్చు, నీటి వినియోగం తగ్గి అధిక దిగుబడి వస్తుందని, భూసార పరీ క్షల ఆధారంగానే ఎరువులు వాడాలని సూచించారు. అనంతరం రైతు లకు భూసార పరీక్షల కిట్లు పంపిణీ చేసి సమిష్టి వ్యవసాయంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో చావా అరుంధతి, బొల్లు హనుమంత రావు, దారావత్ హేమలత బాలాజీ, అంగోత్ మత్రు, ఈసాల వెంకటే శ్వరరావు, భూక్య పద్మ, భూక్య రంజిత్ కుమార్, పూసం రామారావు, అడ్డగోడ ఐలయ్య, దేగల ఉపేందర్, బానోత్ రాంమూర్తి, కడియాల సుధాకర్, సురేందర్ మనియార్, కిలారి అప్పారావు, సూరపురెడ్డి విష్ణువ ర్ధన్‌రెడ్డి, పెద్దబోయిన ఉమాశంకర్, ఆదెర్ల రాములు, అడపా పుల్లా రావు, అజ్మీర నరేష్, కాసాని లక్ష్మీ నారాయణ, గడ్డం వెంకటేశ్వర్లు, పెర్ని వెంకటేశ్వర్లు, వడ్డె అనంతయ్య, ఈసాల ఛాయాదేవి, నాగండ్ల జగన్, అజ్మీర ఈర్యా, చాగంటి వెంకటేశ్వర్లు, అజ్మీర హేమ్లా, బట్టు సంగయ్య, ధళోసింగ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

**-ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన శిక్షణ**
**-డివిజన్ వ్యవసాయ సంచాలకులు రవికుమార్**



**ప్రజాపక్షం/ములకలపల్లి:**ప్రకృతి సాగులో నాణ్యమైన దిగుబడులు సాధించాలని అశ్వారావుపేట డివిజన్ వ్యవసాయ సంచాలకులు రవికు మార్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మూకమామిడి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చేరిన రైతులు కనీసం మూడు సంవత్సరాల పాటు ఎకరం విస్తీర్ణంలో ప్రకృతి సాగు పద్దతులు అనుసరించి నాణ్యమైన పంటలు ఉత్పత్తి చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి అరుణ్ బాబు మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల ప్రాధాన్యాన్ని వివరించగా, కేవీకే కోఆర్డినేటర్ భరత్ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తక్కువ నీటితో సాగయ్యే కంది, పెసర, మినుము పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏఈవో రాహుల్ రైతు భీమా పునరు ద్ధరణకు అవసరమైన పత్రాలపై అవగాహన కల్పించారు. మూకమా మిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మీ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులు పత్తి, మొక్కజొన్న, ఆయిల్ ఫామ్ పంటలను పరిశీలించి, పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు రాహుల్, రమేష్, తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ట్రస్మా నూతన అధ్యాయం

**-ప్రైవేట్ పాఠశాలల ఐక్యతకు శ్రీకారం**



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండ లంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సమావేశం ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూ ల్‌లో నిర్వహించారు. విద్యాభివృద్ధి, ప్రభు త్వ నిబంధనల అమలు, పాఠశాలలు ఎదుర్కొం టున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈసందర్భంగా ట్రస్మా మణుగూరు యూని యన్ నుంచి అశ్వాపురం పాఠశాలలు స్వచ్ఛందంగా తప్పుకోవడంతో, స్థానిక పాఠశాలల ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ట్రస్మా అశ్వాపురం యూనియన్ ఏర్పాటు చేయాలని ఏక గ్రీవంగా తీర్మానించారు. పూర్తి స్థాయి కమిటీ ఏర్పడే వరకు తాత్కాలిక(అడ్‌హాక్)కమిటీని నియమించారు. అధ్యక్షుడుగా ములకలపల్లి గోపీనాథ్(ఎమిలీ పబ్లిక్ స్కూల్), ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్(ప్రగతి స్కూల్), కోశాధికారిగా లెనిన్ విజయ్ కుమార్(ఎక్సలెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్), కార్యవర్గ సభ్యులుగా నాగమణి, మాధవి(సార్క్ ఇంగ్లీష్ మీడియం స్కూల్), పుష్ప(న్యూ వరల్డ్ స్కూల్)లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ మండ లంలోని ప్రైవేట్ పాఠశాలల మధ్య సమన్వయం, విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాలల సమస్యల పరిష్కారం, విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. అనంతరం నూతన కమిటీ పాఠశాలల యాజమాన్యాలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి నిరసన



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలం జగ్గారం గ్రామానికి చెందిన ఓ యువతి, మండల కేంద్రానికి చెందిన యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలి పింది. అయితే యువకుడు పెళ్లికి నిరాకరించడంతో పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని ఆమె ఆరోపించింది. దీంతో శనివారం మధ్యాహ్నం యువతి ప్రియుడి ఇంటి ముందు నిరసనకు దిగింది. తనను వివాహం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

## పోషకాహారంతో ఆరోగ్యవంతమైన భావితరం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు ప్రవేశపెట్టిన తొలి ముద్ద ఉదయం అల్పాహార పథకాన్ని శనివారం లక్ష్మీ పురం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభిం చారు. బూర్గంపాడు ఎంపీడీవో జమలారెడ్డి, లక్ష్మీ పురం సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి చిన్నారులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చిన్నారులకు పోషకాహారం అందించి ఆరోగ్యవంత మైన భావితరాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9గంటలకు సిరిధాన్యాలు, పాలు, గుడ్లతో కూడిన అల్పాహారం అందిం చడం ద్వారా చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు అంగన్‌వాడీల హాజరు శాతం కూడా పెరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పరిశుభ్రమైన గ్రామ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీ డీవో జమలారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని లక్ష్మీ పురం గ్రామ పంచాయితీ కార్యా లయం ఆవరణలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా నిర్మించనున్న సామాజిక మరుగుదొడ్లకు శంకుస్థా పన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జమలారెడ్డి, లక్ష్మీ పురం సర్పంచ్ బాదం వెంకటేశ్వరరెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని అన్నారు. ఈకా ర్యక్రమంలో ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, ఏపీవో విజయలక్ష్మి, ఈసీ వెంకట్, పంచా యితీ పాలకవర్గ సభ్యులు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైరా బాలికోన్నత పాఠశాలకు ఫ్యాన్‌ల వితరణ




**ప్రజాపక్షం/వైరాః** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో వైరా బాలికో న్నత పాఠశాలకు శనివారం ఫ్యాన్లను విరాళంగా అందజే శారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఎస్టియు అధ్య క్షులు దొడ్డా వరప్సాద్, మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండ పాటి రమేష్ పాల్గొని పాఠశాలకు ఫ్యాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విద్యార్థు లకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలకు ఫ్యాన్‌లను విరాళంగా అందించిన తమ్మిశెట్టి రాజేష్‌బాబును పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచాలి

**-నాణ్యమైన పట్టు ఉత్పత్తికి చర్యలు**
**-నా పట్టు నా అభిమానం కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో పట్టు పరిశ్రమ విస్తీర్ణాన్ని పెంచడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నా పట్టు నా అభిమానం 2.0 జిల్లా స్థాయి భాగస్వామ్యుల సంప్రదింపుల సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. కేంద్ర వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు, తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పట్టుపరిశ్రమ రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు చేస్తున్నది, ఎంత కాలం చేస్తున్నది, నీటి వినియోగం, రాబడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం 150 ఎకరాల్లో పట్టు పరిశ్రమ ఉందని ఈ విస్తీర్ణాన్ని 1000 ఎకరాలకు పెంచే లక్ష్యంగా పని చేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా పనిచేసి రైతులకు పట్టు పరిశ్రమపై అవగాహన కల్పించి జిల్లాకు క్లస్టర్ హోదా సాధించాలన్నారు. ఆధునీక సాంకేతికతలను ప్రతి రైతు తప్పనిసరిగా ఆచరణలోకి తీసుకువచ్చి ఆత్మనిర్భరత సాధించాలన్నారు. పట్టు పరిశ్రమ నీటి వినియోగం చాలా తక్కువని, రిస్క్ కూడా తక్కువని రాబడి ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనుభవజ్ఞులైన రైతులు ఇతర రైతులకు అవగాహన కల్పించి చైతన్యం తేవాలన్నారు. ఒక్కో రైతు విడి విడిగా కాకుండా ఎక్కువ మంది రైతులు కలిసి చేస్తే మార్కెటింగ్ లాభం కలుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్ర పట్టు బోర్డు బెంగళూరు సీనియర్ సైంటిస్ట్ డా॥ పి.సుబ్రహ్మణ్యం కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు. పట్టు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు , ఆధునీక సాంకేతిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా అందించి ఉత్పాదకత నాణ్యతను మెరుగుపర్చడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. పట్టు పరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు అనసూర్య జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి శాఖ చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర పట్టు బోర్డు, ములుగు కేంద్ర శాస్త్రవేత్తలు డా॥ తిరుపమ్ రెడ్డి, డా॥ గుండి రాఘవేందర్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, అధికారులు, రైతు ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# తలసేమియా చిన్నారుల విమాన విహారం

**-పది పాసైన చిన్నారులకు సంకల్ప సంస్థ ప్రోత్సాహం**
**-వైజాగ్ పర్యాటక ప్రాంతాల సందర్శన**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అనారోగ్యాన్ని జయించి చదువులో రాణించిన తలసేమియా చిన్నారుల నింగిలో ఎగరాలనే కల నెరవేరింది. ప్రతికూల పరిస్థితులను తట్టుకుని పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన 10 మంది విద్యార్థులు శనివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తొలిసారిగా విమానం ఎక్కి కొత్త అనుభూతిని ఆస్వాదించారు. పదవ తరగతి పాసైన తలసేమియా బాధితులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఈ ప్రయాణాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు వీరు విమానంలో ప్రయాణించారు. అనారోగ్య బాధలను మరిచి ఆకాశంలో విహరిస్తూ చిన్నారులు సంతోషంగా ప్రయాణించారు. వైజాగ్‌లో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన కైలాసగిరి, రుషికొండ బీచ్, ఆర్‌కె బీచ్‌లను సందర్శించి అక్కడ ఉత్సాహంగా గడిపారు. ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం, సబ్ మెరీన్ మ్యూజియంలను సందర్శించారు. తలసేమియా చిన్నారుల ఆరోగ్యాన్ని రక్షించడంతో పాటు వారి ఆశయాలను, కలలను నెరవేర్చేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిరంతరం కృషి చేస్తుందని సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరి అనిత తెలిపారు. ప్రతి యేటా పది పాసైన బాధిత చిన్నారులను ప్రోత్సహించడంలో భాగంగానే ఈ విమాన ప్రయాణాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి రవిచందర్, ఉదయ్ భాస్కర్, పావని పాల్గొన్నారు.

# కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు

**-మూడు వేల మందికి అన్నదానం**
**ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షలు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలు శనివారం వైరా పట్టణంలోని అపూర్వ ఉత్సాహం మధ్య ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న రాందాస్‌నాయక్‌కు కట్ల సంతోష్, చెరుకూరి కిరణ్ భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక రింగు రోడ్డ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు జైజై ధ్వానాలు చేస్తూ టపాసులు పేలుస్తూ, పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి సంబరాలు జరిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. రోడ్లు, త్రాగు నీరు, విద్య, వైద్యం, సాగునీరు, సంక్షేమ పథకాల అమలుకు కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులను వేగవంతం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖానాపురం సర్పంచ్ బాలాజి, కౌన్సిలర్లు మోరు శ్రీకాంత్, ధీరావత్ వెంకటేశ్వర్లు, గోరంట్ల శ్రీదేవి, బత్తుల సుమతి, నాయకులు గుమ్మా రోశయ్య, రాయల రాము, జవ్వాజి నాగరాజు, మచ్చా బుజ్జి, కట్ల నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు చలపతి, సురేందర్, పూర్ణయ్య, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు జిపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) మూడవ రాష్ట్ర మహాసభ ఆదివారం ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల గణేష్ గార్డెన్స్‌లో జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ మహాసభలలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు, డిమాండ్లపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు.ఈ మహాసభలకు గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మల్లయ్య కోరారు.

## చెరువు ఆక్రమణను పరిశీలించిన ఐబీ అధికారులు

**- ప్రజాపక్షం కథనానికి స్పందన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం పాండవులకుంట చెరువు ఆక్రమణపై ప్రజాపక్షం దినపత్రికలో కాల్వను మింగి...కట్టను కూల్చి అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఈ నేపథ్యంలో ఐబీ (నీటిపారుదలశాఖ) అధికారులు శనివారం ఘటనా స్థలాన్ని ప్రత్యేక్షంగా పరిశీలించారు. ఐబీ డీఈ రాజేష్, స్థానిక ఏఈతో కలిసి చెరువు పరిసరాలు పరిశీలించి, చెరువు భూమిలో ఆక్రమణ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పూర్తి వివరాలు నిర్ధారించేందుకు రెవెన్యూ శాఖకు అధికారికంగా లేక పంపనున్నట్లు వెల్లడించారు. చెరువు ఆక్రమణకు సంబంధించిన ఆధారాలతో పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కథనాన్ని ప్రచురించి ప్రజాపక్షం దినపత్రికకు గ్రామ రైతులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. చెరువును పూర్తి స్థాయిలో ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని వారు అధికారులను కోరారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండలంలోని న్యూలక్ష్మీపురం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో తొలిఏకాదశి పర్వదిన వేడుకలు శనివారం అత్యంత భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. హిందువుల తొలి పండువ తొలి ఏకాదశి కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలివచ్చి కోదండరాముడిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తీక్ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అర్చనలు, అలంకరణలు నిర్వహించారు. ఈ మేరకు తొలిఏకాదశి పర్వదినాన రామనామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ నక్కని కోటయ్య, వైస్ ఛైర్మన్ గడ్డం కుమారస్వామి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని ప్రతీ ఏటా తొలిఏకాదశి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## అల్పాహారాన్ని ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/మధిర:** మాటూరుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని సర్పంచ్ చిలువేరు పూర్ణమ్మ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు వేడివేడిగా అల్పాహారం అందించారు. ప్రభుత్వ విద్యతో పాటు పోషణకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని, పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మధిరను క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దుతాం



**ప్రజాపక్షమ/మధిర:** మధిర పట్టణాన్ని పరిశుభ్రతకు మారుపేరుగా రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా యంత్రాంగం అడుగులు వేస్తుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక చొరవతో మధిర అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు వెల్లువెత్తుతుండటంతో, పట్టణంలో ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. డిప్యూటీ సిఎం సంకల్పానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని, మన మధిరను మనమే క్లీన్‌గా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి బాటలో భాగంగానే పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మన మధిర–మన బాధ్యత పేరుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల శానిటైజింగ్ యాక్షన్ ప్లాన్ అమలును ముమ్మరం చేశారు. ఇందులో తొలి దశలో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన నాల్గో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సామ్యూల్ బెనిటిక్, ఇస్రాయిల్ పాల్, ఇన్వింత్ర ప్రైవేటు లిమిటెడ్ సీఈవో సుద్దాల ఉదయ్ చంద్ర, 13వ వార్డు కౌన్సిలర్ షేక్ రసీద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

**- విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే తీవ్ర పరిణామాలు**
**- రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర**




**ప్రజాపక్షం/మంచుపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని రాజ్య సభ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రాడ్యుయేట్ ఫోరం ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లోని కమ్మ సత్రంలో శనివారం వివిధ రాజకీయ పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నాయకులు, కళా శాలల యాజమాన్యాలు, లెక్చరర్ యూనియన్లు, ఎస్టీ, ఎస్సీ సంఘాల ప్రతినిధులు, సీపీఐ, సీపీఐ (ఎంఎల్), మాస్‌లైన్, టీఆర్ఎస్ తదితర రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరమన్నారు. అనంతరం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. విద్యార్థులు ఏం తప్పు చేశారని, వారికి రావాల్సిన నిధులను ఎందుకు సకాలంలో విడుదల చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దోచుకోవడం, పంచుకోవడం, దాచు కోవడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థుల భవిష్యత్‌పై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ బడ్జెట్ గణనీయంగా పెరిగిందని, కొత్త జిల్లాల ఏర్పాటు, మెడికల్ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిర్మాణాత్మక అభివృద్ధికి బదులుగా కూల్చివేతలకే పరిమితమైంది విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారాన్ని వీడే సమయానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.2 వేలు ఉంచి రూ.3 వేల కోట్ల వరకు మాత్రమే ఉన్నాయని, గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఉన్న భారీ బకాయిలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే చెల్లించిందని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ఏ ఒక్క ప్రభుత్వానికి సంబంధించిన పథకం కాదని, ఇది రాష్ట్ర ప్రభుత్వ నిరంతర బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులు, యువత సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తే భవిష్యత్‌లో తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేసి వారి భవిష్యత్‌ను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాలను మరింత విస్తృతం చేసి, అని వర్గాలను కలుపుకొని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర నేత సలిగంటి శ్రీనివాస్, సిపిఐ (ఎంఎల్) గోపాల్ రావు, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ దిండిగాల రాజేందర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సీతామహాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు బొమ్మిడి రమాకాంత్, ఎన్‌కె నగర్ సర్పంచ్ బాదావత్ శ్రీకాంత్, బీఆర్ఎస్ యువజన ఆయకుడు బొమ్మిడి శ్రీకాంత్, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష పార్టీ నాయకులు, కళాశాల యాజమాన్యాలు, మేధావులు, విద్యార్థి తల్లిదండ్రులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోల పనితీరు పరిశీలన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** టీపీసీసీ ఆదేశాల మేరకు పినపాక నియోజకవర్గ అసెంబ్లీ ఎస్ఐఆర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్, ఈఆర్‌వో కోఆర్డినేటర్ గాదె కేశవరెడ్డి శనివారం బూర్గంపాడు మండలంలోని 210, 214, 215, 216, 220, 221, 225, 226 పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా 221 బూత్ బీఎల్‌వో సోడే నాగరత్నం 99శాతం, 225 బూత్ బీఎల్‌వో బి దేవకర్ణ, 226 బూత్ బీఎల్‌వో యు వెంకమ్మ 100శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడంపై వారిని బూర్గంపాడు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వారాల వేణు, బీఎల్‌ఏలు బాదం వెంకటేశ్వరరెడ్డి, బాదం సంజీవరెడ్డి, నరేష్ యాదవ్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, చెంచలపు శ్రీనివాసరావు, బీఎల్‌వోలు లాలమ్మ, హేమలత, బాలమ్మ, నాగమణి, దేవకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మొదటి విడత టీచర్ల ట్రైనింగ్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో మూడు రోజుల పాటు ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మూడో రోజు జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్ కుమార్ గణితం రేమిడిమేషన్ తరగతులు బోధించారు. గణితంలో మరింత పట్టు సాధించేలా వివిధ అంశాల పై ఉపాధ్యాయులకు తరగతులు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్ఎల్యాం, టీఎల్యాం, ఐఎల్యాంల వలన జరిగే ఉపయోగాలను వివరించారు. పాఠశాలలో ప్రతీ రోజు ఒక గంట రిమీడియేషన్ కార్యక్రమం ను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ప్రతీ తరగతి లో ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ఖచ్చితంగా అమలు చేసి పాఠశాలల బలోపేతం లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, ఆర్పీ లు మాదవ్, స్వామి, శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎం.రమేష్, ఉపాధ్యాయులు టి.వెంగళరావు, తొర్తి సురేష్, రామరావు, తొర్తి గురవయ్య, మారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జెన్కో రూ.54 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

**- ఎఐటీయూసీ నేత మిరియాల రంగయ్య డిమాండ్**



**ప్రజాపక్షం/మంచుపల్లి:** తెలంగాణ జెన్కో నుంచి సింగరేణికి రావాల్సిన రూ.54 వేల కోట్ల మొండి బకాయిలను కనీసం విడతల వారీగా అయినా వెంటనే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నెల 23, 24 తేదీల్లో సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు సింగరేణి ఏరియాల్లో పర్యటించడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే కొత్తగూడెంలో జెన్కో, సింగరేణి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సింగరేణికి రావాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిల అంశంపై ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఈ బకాయిలను విడతల వారీగా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని సింగరేణి సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడాలని కోరారు. అలాగే సత్తుపల్లి అవంతిక ప్రాజెక్టు, మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్, కోయగూడెం, ఇల్లందు జేకే5 ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో సంస్థలో బొగ్గు ఉత్పత్తి పెరిగి వేలాది మంది కార్మికుల ఉపాధికి భరోసా లభిస్తుందని తెలిపారు. రామ్‌పురం మైన్ గ్యాసిఫికేషన్‌కు అనువైన గనిని తక్షణమే ప్రారంభించాలని, ఇది సింగరేణి భవిష్యత్ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుడికి ఇన్వాలిడేషన్ మంజూరు చేయాలని మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. గుండె శస్త్రచికిత్సలు చేయించుకున వారు, పక్షవాతం సహా వివిధ తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కార్మికుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి వారికి ఇన్వాలిడేషన్ కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాల వాటా ప్రకటన కోసం కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారని, ఆ ప్రకటనను వెంటనే విడుదల చేసి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నరసాపురం పీహెచ్‌సీకి ఐటీసీ మిషన్ సునేహ్రాకల్ అండ




**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండలం నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ)ఐటీసీ మిషన్ సునేహ్రాకల్(ఎంఎస్‌కే) ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల బ్లాక్, అందించిన వైద్య పరికరాలను భద్రాచలం ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి రాహుల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అభివృద్ధికి ఐటీసీ మిషన్ సునేహ్రాకల్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మౌలిక వసతులు, విద్యార్థులకు అవసరమైన సామగ్రి అందిస్తూ సంస్థ సేవలందిస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత లేకుండా చర్యలు చేపడతామని అన్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది, ఐటీసీ మిషన్ ప్రతినిధులు ఎంఎల్‌ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావును శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శరత్, ఐటీసీ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ జయప్రకాశ్, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ గీత ప్రవల్లిక, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 101 కిలోల గంజాయి పట్టివేత

**- నలుగురు అరెస్ట్**
**- కారు సెల్‌ఫోన్లు స్వాధీనం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా తరలించుకుపోతున్న 101కిలోలీ ఎండు గంజాయిని శనివారం ఎక్సైజ్ అధికారులు స్వాదీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి కారుతో పాటు నాలుగు సెల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం పట్టణంలోని కూనవరం రోడ్‌లో గల వీరభద్ర ఫంక్షన్ హాల్లో సమీపంలో తనిఖీలు నర్వహిస్తుండగా కేఏ 03 ఎన్ఆర్ 5892 నెంబరు గల వాహనం వేగంగా వస్తున్న క్రమంలో ఆనుమానంతో ఆపిన ఎక్సైజ్ పోలీసులు కారులో సోదాలు నిర్వహించంగా గంజాయి కంటపడింది. దీంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులను ఆరా తీయడంతో కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలించుకుపోతున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన నింధితులైన సలీం పాషా, రాజేంద్ర ప్రసాద్, ఎండి అర్బాజ్ హుస్సేన్, ఎస్ గుల్జార్‌లను అదుపులోనికి తీసుకుని వారు వినియోగించిన కారుతో నాలుగు సెల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సిఐ రహీమున్నీసా ఎస్ సీతారామరాజు హెడ్ కానిస్టేబుల్ కరీమ్ పోలీస్ సిబ్బంది భద్రం, సీతారాం రాకేష్ రవి తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బందిని నియమించాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** రొంపేడు, కొమరారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి, అవసరమైన మందులు, మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సీపీఎం ఆధ్వర్యంలో రెండు పీహెచ్‌సీల్లో నిర్వహించిన సర్వే అనంతరం సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో ఇద్దరు డాక్టర్లు అవసరం ఉండగా ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఒక్కో వైద్యుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మండే మోహన్‌రావు, ఖాదర్, న్యాయవాది సుడిగాల వెంకటనరసయ్య, సత్యనారాయణ కోరి, నయీం బేగ్, సలీమా, వెంకన్న, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటాలకు తలవంచక తప్పదు

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** దేశవ్యాప్తంగా సంచలన సృష్టించిన నీట్ సిబిఎస్ఇ పరీక్షా పేపర్ల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఐక్య పోరాట విజయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశరాజధాని ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద విద్యార్థి లోకం నిర్వహించిన పోరాట ధాటికి కేంద్ర ప్రభుత్వం తలవంచి దిగిరాక తప్పలేదన్నారు. కేంద్ర విద్యాశాఖలోని నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడిందని, మనస్తాపంతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు పాల్పడటం తీవ్రవిచార కరమన్నారు. లీకేజీ బాధ్యుడైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాత సరిపెట్టకుండా ఆయనకు మున్ముందు ఎలాంటి శాఖను కేటాయించవద్దని డిమాండ్ చేశారు. కల్తీలేని విద్యావ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని దీనిపై పార్లమెంట్ వేదికగా సుదీర్ఘ చర్చ జరగాలని కోరారు. నీట్ అక్రమాల వల్ల ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన హక్కుల కోసం శాంతి యుతంగా ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ సిపిఐ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ఉద్యమాలు కొనసాగించామని గుర్తు చేశారు.

# 30ఏళ్ల వ్యవసాయ రహదారి ధ్వంసం

**ప్రజాపక్షం/ఇల్లందు:** సీఎస్‌పి బస్తీ గ్రామ పంచాయితీ పరిధిలోని రాజీవ్‌నగర్ గ్రామంలో ఆదివాసీ, గిరిజన రైతులు గత 30ఏళ్లుగా వినియోగిస్తున్న వ్యవసాయ రహదారిని ధ్వంసం చేశారని మాజీ సర్పంచ్ ఆరోపించారు. ఈ రహదారికి గతంలో ఎన్‌ఈఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రావెల్ పనులు కూడా చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతో గ్రామ పంచాయితీ పరిధిలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నిస్తే తాము ఎంఎల్ఏ అనుచరులమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించి, అక్రమ మట్టి తవ్వరాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# పోరాట ఫలితంగానే చారిత్రిక విజయం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశంలో యువత, విద్యార్థులు చేసిన పోరాట ఫలితంగానే చారిత్రిక విజయం లభించిందని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని ఎన్‌టిఆర్ సర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ మోడీ అహంకారాన్ని ఈ దేశ యువత  పోరాడి దెబ్బతీసిందన్నారు. విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలను ప్రవేశపెట్టాలని మత పరమైన విషయాలను చొప్పించిన బిజెపి ప్రభుత్వం విద్యా విధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పోలీసుల వ్యవహార శైలిపై హింసాత్మక ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని నాయకులు డిమాండ్ చేశారు. రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు దేశ యువత సిద్ధం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు బుర్రా మనోజ్, వెంకటేష్, సాయి, కృష్ణప్రసాద్, రమ్యశ్రీ, శ్రీహర్షిత, శ్రీచందన, శ్రీనిధి, శైలజ, హరిణి, అక్షిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్కళ దంపతుల ఆధ్వర్యంలో శనివారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా ఒంచ్రకళతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యతో యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. రక్తదానం మహాదానం అని, అవసరమైన సమయంలో అనేక మంది ప్రాణాలను కాపాడే గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవా భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంగారావు, పమ్మి అశోక్, మాజీ మున్సిపల్ చైర్మన్ జైపాల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, తాటిపూడి సర్పంచ్, ఖానాపురం సర్పంచ్ బాలాజి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు లగడపాటి ప్రభాకర్, వుండ్రు శ్యామ్‌బాబు, మిట్టపల్లి నాగి, గుమ్మా రోశయ్య, రాయల రాము, ఆత్మ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, మచ్చా బుజ్జి, కట్ల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ జెఏసి పోరాట ఫలితంగా స్వరాష్ట్రాన్ని సాధించాం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ జెఏసి చేపట్టిన ఉద్యమాలు, ప్రాణ త్యాగాలు, ఐక్యపోరాటం ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని రాష్ట్ర నూతన జెఏసి చైర్మన్, సీనియర్ హైకోర్టు న్యాయవాది గుండా కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పాలేరు నియోజకవర్గ జెఏసి కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం మండల పరిధిలోని దమ్మాయిగూడెం సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, ప్రజా సంఘాలు అందరూ భుజం భుజం కలిపి పోరాడిన ఫలితమే స్వరాష్ట్రం అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు ఐక్యంగా పనిచేయాలని, ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల సేవలను ఎప్పటికీ మరువలేమని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనను పుష్పగుచ్చం అందచేసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేస్తూ ఉత్సాహాభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపిపి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల అశోక్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం రాజశేఖర్, మాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు, ప్రముఖ జర్నలిస్టులు ప్రజాపక్షం రిపోర్టర్ మేక  నాగరాజు, సిరిసవాడ సత్యం, పప్పుల శ్రీను, కూరపాటి విజయ్‌కుమార్, గోవింద్, వెంకట్, నెమల్‌బాబు, బోడపట్ల సతీష్, కొత్త వెంకన్న, కామల్ల వీరయ్య, దామల్ల భాస్కర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరక్టర్ జడల నగేష్‌గౌడ్, వివోఏల మండల అధ్యక్షులురాలు వేల్పుల సుశీల, టిడిపి జిల్లా నాయకులు కొండబాల కరుణాకర్, కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, పోట్ల కిరణ్, సిపిఎంఎల్ జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# వైరా రిజర్వాయర్ ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలి




**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని ఆయకట్టు పరిధిలోని రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే సాగు నీటిని విడుదల చేయాలని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని, నీటిపారుదలశాఖ అధికారులను డిమాండ్ చేశారు. సిపిఎం వైరా రూరల్, టౌన్ కమిటీల పిలుపు మేరకు శనివారం రైతులు మధిర రింగు రోడ్డు నుంచి భారీ ర్యాలీగా బయల్దేరి వైరా నీటిపారుదలశాఖ(ఐబి) కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు డిఈ నాగబ్రహ్మంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీతారామ కాల్వ ద్వారా నీరు వస్తుందని ప్రకటించి తొలుత వైరా ప్రాజెక్టు ఆయకట్టుకు వరి సాగు కోసం పరిమితంగా నీటిని విడుదల చేసిన ప్రభుత్వం అనంతరం ఎల్‌నినో ప్రభావం పేరుతో మధ్యలోనే నీటి విడుదల నిలిపివేయడం వలన ప్రాజెక్టు పరిధిలోని సుమారు 25వేల ఎకరాల సాగు భూములు బీడు భూములుగా మారే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటి విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే ఆయకట్టు పరిధిలోని రైతులు రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే రైతాంగమే స్వయంగా కాల్వలకు నీటిని విడుదల చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, వైరా మున్సిపల్ కౌన్సిలర్ కిన్నెర కృష్ణ, అష్ణగుర్తి సర్పంచ్ కంచ్ల అనిత, పార్టీ నాయకులు మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, మాగంటి తిరుమలరావు, చెరుకుమల్లి కుటుంబరావు, మల్లెంపాటి రామారావు, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, తోట కృష్ణవేణి, ఎన్.వెంకటరెడ్డి, ద్రోణాదుల నాగేశ్వరరావు, చిత్తారు నాగరాజు, కంచర్ల నాగేశ్వరరావు, విసి సత్యనారాయణ, మొత్తమాల విజయరాజు, బాణాల కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల పోరాటం, సాధించిన విజయం చెంపపెట్టువంటిదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శనివారం తెలిపారు. ఈ పోరాటం కేవలం ఒక సమస్య పరిష్కారానికి మాత్రమే కాకుండా దేశంలో మార్పును కోరుకునే యువత సంకల్పానికి ప్రతీకగా నిలిచిందన్నారు. విద్యార్థులు,యువత ఆశయాలను విస్మరిస్తూ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఉద్యమం గుణపాఠంతో పాటు హెచ్చరికగా నిలిచిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిష్టానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలను ప్రజలు సహించరని వారికి గుణపాఠం చెబుతారనే విషయాన్ని ఈ విజయం మరో సారి స్పష్టం చేసిందన్నారు. ఇకపై విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల ధృకృథంతో స్పందించి ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని పువ్వాడ అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# అతిథి అధ్యాపకులను మల్టిజోన్ 1 వారినే తీసుకోవాలి

**-ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లాలో ప్రభుత్వ, డిగ్రీ, పిజి కళాశాలలో అతిథి అధ్యాపకులను మల్టిజోన్ 1లో ఉన్న స్థానికులకే అవకాశం కల్పించి పోస్టులు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఎస్ఆర్ అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లాకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో నూతనంగా అతిథి అధ్యాపక పోస్టులను మల్టిజోన్1లో కాకుండా ఓపెన్‌గా భర్తీ చేయడం వల్ల నాన్ లోకల్ వారికి ఉద్యోగాలు రావడం వల్ల స్థానికులు నష్టపోతున్నారన్నారు. మల్టిజోన్ 1లో ఉన్న వారికే నిబంధనల ప్రకారం ఇవ్వడం వల్ల స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ సానుకూలంగా స్పందించారని మల్టిజోన్1లో స్థానికులను నిబంధనల ప్రకారం భర్తీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ నాయకులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చింతల రమేష్, మద్దోజు శ్రవణ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుర్రా మనోజ్, ఏఐవైఎఫ్ నాయకులు కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆషాఢ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య శనివారం సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, అనంతరం సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరు ఆలయాల అర్చకులు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించగా, ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు.  ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మల్లూరి అంకంరాజు, కోటగిరి వెంకటరావు, ఒగ్గు జగ్గారెడ్డి, అద్దంకి అనిల్, చంద్ పాషా, పర్వతనేని వేణు, ఐనంపూడి సత్యం, జొన్నలగడ్డ విజయ్, సుంకర వాసు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ బ్లాక్ రైస్ పంట పరిశీలన

**ప్రజాపక్షం/భద్రాచలం :** సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న ఆర్గానిక్ రైస్ పంటలను ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ జు శనివారం పరిశీలించారు. సమీప పొరుగు రాష్ట్రంలోని ఎటపాక మండలం కొత్తూరు నారాయణ పురం ఎస్‌హెచ్‌జి మహిళా గ్రూపు సభ్యులు పూర్తిగా సేంద్రీయ ఎరువులతో పండిస్తున్న బ్లాక్‌రైస్ పంటలను పరిశీలించి పండించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం పరిసర ప్రాంతాల మహిళా సంఘాలు తయారు చేసిన ఆర్గానిక్ పస్తువులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుండటంతో పూర్తి ఆర్గానిక్ వస్తువులను పండించేందుకు కృషి జరుగుతుందని, నూతనంగా ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్‌లో లభించే వస్తువులకు డిమాండ్ పెరగడంతో స్థానికంగాపండించేందుకు చర్యలు జరుగుతున్నాయన్నారు. ఆర్గానిక్ పాల ఉత్పత్తులతోపాటు నిత్యవసరాలు భద్రగిరి మార్ట్‌లో లభ్యమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎటపాక ఏపిఓ భాస్కర్ రావు జిసిసి మేనేజర్ జయరాజ్ ఎస్‌హెచ్‌ఓ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని సబ్ కలెక్టర్  కార్యాలయంలో శనివారం సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై గౌరవ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ నీటి పారుదల అటవీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు కాలువలు డిస్ట్రిబ్యూటరీ నిర్మాణానికి భూసేకరణ పురోగతి పరిహారం పంపిణీ అంతర్ శాకల సమన్వయం రెవెన్యూ ఇరిగేషన్ ఫారెస్ట్ అధికారుల తో సమన్వయం పనిచేసే పెండింగ్లో ఉన్న క్లియరెన్సును భూ పరిశీలన నివేదికలను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.